సాక్షి వికారాబాద్

ఆదివారం । 18 । జూన్ । 2023



క్లిక్ చేస్తే ఖల్లాసే!

'వాట్సాప్‌కు కొత్త వర్షన్ వచ్చేసింది. పింక్ లింక్‌తో అప్‌డేట్ అవ్వండి' అని మేసేజ్‌లు వస్తున్నాయా? అయితే జాగ్రత్త. 8లో▸



ఘనత మాదే

తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. 8లో▸



అయోమయం

కులవృత్తి దారులకు ప్రభుత్వం అందజేయనున్న రుణాల పంపిణీపై ప్రజల్లో అవగాహన కరువైంది. 9లో▸

న్యూస్‌రీల్

కొడంగల్‌కు బెస్ట్ మున్సిపాలిటీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

కొడంగల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొడంగల్ ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైంది. శుక్రవారం రాత్రి నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 25వేల లోపు జనాభా ఉన్న మున్సిపాలిటీల కేటగిరీలో కొడంగల్‌కు అవార్డు దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో ఆబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న తలనీలాల పోగునకు వేలం

అనంతగిరి. వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంత పద్మనాభస్వామి ఆలయంలో తలనీలాలు పోగు చేసుకునేందుకు ఈనెల 22న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈఓ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ. 10 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని, వేలం దక్కని వారి డబ్బులు వాపస్ ఇచ్చేస్తామని పేర్కొన్నారు. వేలం పొందిన వారికి ఏడాది పాటు హక్కులు కల్పిస్తామని తెలిపారు.

బషీరాబాద్ డీటీ బదిలీ



వీరేశ్‌బాబు

బషీరాబాద్: బషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు బదిలీ అయ్యారు. వికారాబాద్ మండల డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికల అధికారి)గా పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండేళ్లుగా మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఓపికగా తెలుసుకునే వారని తహసీల్దార్ వెంకట్‌స్వామి అన్నారు.


ఉపాధ్యాయులను నియమించండి



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

పూడూరు: మండల పరిధిలోని కడుమూరు పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతూ విద్యార్థులు శనివారం స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు, సిబ్బంది

బషీరాబాద్: మండలంలోని పర్వత్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ టీచర్ బాలమణి ఆధ్వర్యంలో 'అంగన్‌వాడీ బాట' చేపట్టి మూడేళ్లలోపు చిన్నారులను సెంటర్‌లో చేర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫీర్మాబేగం, ఉప సర్పంచ్ బ్రహ్మానందారెడ్డి, కార్యదర్శి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రంగారెడ్డి జిల్లాకు సీఎం కేసీఆర్ రాక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈ నెల 19న (సోమవారం) నిర్వహించే హరితహారం కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యం మంత్రి కేసీఆర్ జిల్లాకు రానున్నారు. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం తుమ్మలూరులో మాక్ ప్రాజెక్ట్ ఎదురుగా నిర్వహించే హరితహారం కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం మంత్రి పి.సబితారెడ్డి సభాస్థలిని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి పరిశీలించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించారు.

నాన్నకు ప్రేమతో..

అందరి విజయం వెనకాల ఆయన కష్టమే

- పిల్లల భవిష్యత్తే ఊపిరిగా బతికే ఏకైక వ్యక్తి
- ప్రతీ జీవితం తండ్రి భిక్షే • నేడు ఫాదర్స్ డే

నాన్నంటే ఓ ధైర్యం.. నాన్నంటే ఓ త్యాగం.. తన సంతోషాలను పక్కనపెట్టి.. అనుక్షణం పిల్లల కోసం కష్టపడే ఒకే ఒక్క వ్యక్తి నాన్న. జీవిత పోరాటంలో తాను ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా.. తన బిడ్డలకు ఎలాంటి కష్టం కలగకుండా.. వారిని ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు ఆయన పడే బాధలు అన్నీఇన్నీ కావు. అలాంటి నాన్నలందరికీ హ్యాట్సాఫ్ చెబుతూ.. ఫాదర్స్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

– వికారాబాద్

❖ మిస్‌యూ నాన్నా..



మా నాన్న అన్ని విషయాల్లో నన్నెంతో ప్రోత్సహించేవారు.. నేను బాగా చదవాలని కోరుకునే వారు. క్లాస్‌లో నేనే ఫస్ట్ రావాలని ఆకాంక్షించేవారు. నా చిన్నతనంలో ఆయన నాతో అన్న మాటలు ఇప్పటికీ గుర్తొస్తాయి. నేను 7వ తరగతి చదువుతుండగా నాన్నను కోల్పోయా. అప్పటినుంచి ఆయనను ఎంతో మిస్సయ్యా. మా ఇంట్లో నేనే చిన్నవాడిని కావడంతో నా విషయంలో చాలా కేర్ చూపించేవారు. నాకు సంబంధించిన ప్రతీ విషయాన్ని ఆయన దగ్గరుండి చూసేవారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితోనే కష్టపడి చదువుకున్నా. ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్యాన్ని మరవలేదు. నాన్న నా సక్సెస్‌ను చూడకపోవడం ఎప్పటికీ తీరని లోటే. నన్ను కలెక్టర్‌గా చూసే అదృష్టాన్ని నాకివ్వకుండానే వెళ్లిపోవడం ఇప్పటికీ బాధేస్తోంది. ప్రతిఒక్కరూ తల్లిదండ్రులను అపురూపంగా చూసుకోవాలి. అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు

– కలెక్టర్, సి.నారాయణరెడ్డి

❖ ఆయనే నా రోల్ మోడల్



తండ్రిని సన్మానిస్తున్న ఎస్పీ

మాది సూర్యపేట జిల్లా, మునుగాల మండలం మాచారం గ్రామం. మా నాన్న నంద్యాల హన్మంత్ రెడ్డి సాధారణ రైతు. నాకు సోదరుడు, సోదరి ఉన్నారు. నాన్న నన్నెంతో ఆప్యాయంగా చూసుకునేవారు. ప్రతీ చిన్న విషయా న్నీ నాతో పంచుకునేవారు. ఏ పనిచేయాలన్నా నా అభి ప్రాయం అడిగేవారు. నా చిన్ననాటి నుంచి ఉన్నత విద్యాభ్యాసం వరకు వేలు పట్టి నడిపించారు. ఏం సాధించాలనుకున్నా.. అంతా నీ ఇష్టం.. లక్ష్యాన్ని విస్మరించకుండా ముందుకు సాగాలి అని చెప్పేవారు. ఆయన స్ఫూర్తితోనే ఇక్కడి వరకు రాగలిగా. ఆయన ఇచ్చిన ధైర్యం, ప్రోత్సాహంతోనే 2007లో గ్రూప్–1 సాధించి పోలీసు శాఖలో డీఎస్పీగా ఉద్యోగంలో చేరా. చేసే పనిని నిజాయితీగా.. అంకితభావంతో చేయాలని చెప్పిన నాన్న మాటలు నిత్యం గుర్తొస్తాయి. విధి నిర్వహణలోనూ వీటిని తప్పకుండా పాటిస్తా.

– ఎస్పీ, నంద్యాల కోటిరెడ్డి

❖ నాన్నే ఆదర్శం

చేవెళ్ల మండలం గుండాల మాది. నాన్న పేరు ఎస్.పోచిరెడ్డి. నా ప్రతీ విజయంలో మానాన్న పాత్రే కీలకం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా నన్ను బాగా చదివించారు. ఇంటర్ నుంచి పీజీ వరకు కేంద్రీయ విద్యాలయంలో చదువుకున్నా. గ్రూప్ వన్ సాధించాలనే లక్ష్యంతో ముందుకుసాగినా.. కొద్దిలో మిస్సయ్యా. ఆ తర్వాత నాన్న ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరా. చదువుకున్న రోజుల్లో, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా నాన్న నన్నెంతో జాగ్రత్తగా చూసుకునేవారు. ఎలాంటి వారితో స్నేహం చేయాలి.. ఎలాంటి అలవాట్లను కలిగి ఉండాలి. పెద్దలతో ఎలా మాట్లాడాలి..? అనే అన్ని విషయాలను చెప్పేవారు. ఇప్పటివరకూ నాన్న చూపిన బాటలోనే నడుస్తున్నా. ఆయనే నాకు ఆదర్శం.

– జెడ్పీ డిప్యూటీ సీఈఓ, సుభాషిణి



నాన్నతో జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి



తండ్రి విఠల్‌గౌడ్‌తో డీఎస్పీ శేఖర్‌గౌడ్

❖ ఆప్యాయతకు మారుపేరు

మాది పెద్ద కుటుంబం. నిజామాబాద్ జిల్లా ఆర్మూరులోని బొంకల్‌పల్లి స్వగ్రామం. నాన్న పేరు విఠల్‌గౌడ్. ఐదుగురు కూతుళ్లు, ముగ్గురు కుమారులు సంతానం. నేను ఏడో వాడిని. చిన్నతనంలో ఏడో తరగతి వరకు నాన్న వద్దే ఉంటూ చదువుకున్నా. ఆయన 1946లోనే మెట్రిక్ పాసయ్యారు. మమ్మల్ని చదివించేందుకు ఎంతో కష్టపడ్డారు. మాకున్న వ్యవసాయ పొలాన్ని సాగు చేసి అందరినీ చదివించారు. మా పెద్దన్నయ్య గంగధర్‌గౌడ్ సిద్దిపేటలో ఆర్టీసీ ఉద్యోగి కావడంతో ఉన్నత విద్యనంతా అక్కడే పూర్తి చేశా. సెలవులు వస్తే ఇంటికి వెళ్లి నాన్నతో గడిపేవాడిని. గ్రామంలోని ప్రతిఒక్కరినీ ఆయన ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. ఆయన లేని లోటు మమ్మల్ని బాధిస్తుంది.

– తాండూరు డీఎస్పీ, శేఖర్‌గౌడ్



పాఠశాల వరండాలో విద్యార్థులు

విద్యార్థులను గెంటేసి.. తరగతి గదులకు తాళం

- గదుల కోసం ఉపాధ్యాయుల కొట్లాట
- రోజంతా ఎండ, వరండాలోనే కూర్చున్న చిన్నారులు

పరిగి: తరగతి గదుల కోసం ఉపాధ్యాయుల మధ్య జరిగిన వివాదం.. విద్యార్థులను బయటకు గెంటేసి తాళం వేసే వరకూ వెళ్లింది. దీంతో పిల్లలు రోజంతా వరండాలోనే కూర్చున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పరిగిలో బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నాయి. కింద ఉన్న మూడు గదుల్లో బాలుర పాఠశాల, పైమూడు గదుల్లో బాలికల స్కూల్ కొనసాగుతోంది. 'మన బడి' పథకంలో భాగంగా బాలికల పాఠశాలకు రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటితో పాఠశాలలోని ఆరు గదులకు మరమ్మతు పనులు చేయించారు. స్కూళ్లు పునఃప్రారంభం కావడంతో బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కనకాచారి.. బాలుర పాఠశాలకు కేటాయించిన కింది మూడు గదులు కూడా తమవేనంటూ మూడు రోజుల క్రితమే విద్యార్థులను బయటకు గెంటేసి తాళం వేశాడు. ఈ విషయాన్ని బాలుర పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎంఈఓ హరిశ్చందర్‌కు తెలియజేశారు. శనివారం కూడా గదులకు తాళం తీయకపోవడంతో చేసేది లేక విద్యార్థులు వరండాలోనే కూర్చుని పాఠాలు విన్నారు. ఈ విషయంపై ఎంఈఓను వివరణ కోరగా ఉపాధ్యాయులతో మాట్లాడి.. సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట



మోమిన్‌పేట: ఇజ్రాచిట్టపల్లి వేడుకల్లో ఎమ్మెల్యే ఆనంద్, గిరిజనులు



కొటాలగూడెంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బొంరాస్‌పేట: బొట్లోనితండాలో బోనాలెత్తిన గిరిజనులు

- తండాలను పంచాయతీలుగా గుర్తించిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- ఆత్మగౌరవ ప్రతీకగా బంజారా భవన్ నిర్మాణం
- ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

మోమిన్‌పేట: సీఎం కేసీఆర్ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని ఇజ్రాచిట్టంపల్లిలో శనివారం గిరిజనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలను పంచాయతీలుగా గుర్తించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఐదేళ్ల క్రితం తండాలు ఎలా ఉండేవో..? ఇప్పుడు ఎలా ఉన్నాయో..? గమనించాలని కోరారు. గిరిజనుల ఆత్మగౌరవ ప్రతీకగా సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో బంజారా భవన్ నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశీరాం, ఎంపీటీసీ సభ్యురాలు కమిలీబాయి, ఆర్డీఓ విజయకుమారి, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి కోటాజీ, ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, నాయకులు నర్సింలు, రవి, తుకారాం తదితరులు ఉన్నారు.

అలరించిన నృత్యాలు

అనంతగిరి: వికారాబాద్ మండలం కొటాలగూడెంలో గిరిజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చేసిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి, వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ గిరిజన వేషధారణలో ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాములునాయక్, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాములు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేసీఆర్ కృషి ఎనలేనిది

బొంరాస్‌పేట: గిరిజనుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషి ఎనలేదని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాపన్‌చెర్వుతండా, బుర్రితండా, మేడిచెట్లతండాతో పాటు మరో ఐదు తండాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ అరుణదేశు చౌహాన్, ఎంపీపీ హేమీబాయి, వైస్ ఎంపీపీ శ్రావణ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, దేశ్యానాయక్, రాములునాయక్, కోట్లయాదగిరి, చాంద్‌పాషా, నెహ్రూనాయక్ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

గొర్లు దొరుకుతలేవ్

- పక్క రాష్ట్రాలకు వెళ్లి ఉట్టి చేతులతో వచ్చిన అధికారులు
- జీవాల కొరతతో తేదీ మారిన రెండో విడత పంపిణీ
- జిల్లాలో 311 గొల్లకురమ సొసైటీలు
- మొదటి విడతలో 10,477 యూనిట్ల పంపిణీ
- ఈసారి లక్ష్యం 11,583 యూనిట్లు



వికారాబాద్: రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి కొత్త సమస్య ఎదురవుతోంది. గొల్లకుర్మలకు అందించేందుకు జీవాలు దొరకడం లేదు. ఈనెల 9న గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉన్నా.. కొరత కారణంగా వాయిదా పడింది. జీవాలు తెచ్చేందుకు ఇటీవల కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లిన అధికారుల బృందం ఉట్టి చేతులతోనే తిరిగొచ్చింది. దీంతో పంపిణీ తేదీని ఈనెల 22కు మార్చారు. ఆలోపు గొర్రెలు తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి విడతలో జిల్లాలో మొత్తం 10,477 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేయగా.. ప్రస్తుత రెండో విడతలో 11,583 యూనిట్లు అందజేయాల్సి ఉంది. ఇందుకోసం పశుసంవర్ధక శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విడుదల కాని బడ్జెట్

బడ్జెట్ విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ జిల్లాకు కేటాయించిన నిధులు ఇప్పటికీ రాలేదు. మొదటి విడతకు సంబంధించిన పలువురు లబ్ధిదారులకు వివిధ కారణాలతో చివరి నిమిషంలో పంపిణీ ఆగిపోయింది. ఈ డబ్బులు రూ.2 కోట్లు కలెక్టర్ ఖాతాలో ఉన్నాయి. ఆ డబ్బులతో ప్రస్తుతం రెండో విడత ప్రారంభించినా.. మిగతా యూనిట్ల కోసం బడ్జెట్ వచ్చే వరకూ వేచిచూడాల్సిందే. యాదవులు, గొల్లకుర్మలకు ఆర్థిక చేయూతనివ్వడంతో పాటు మాంసం ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మొదటి విడతలో 50 శాతం.. రెండో విడతలో 50 శాతం యూనిట్లు పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. 18 ఏళ్లు నిండిన గొల్లకురుమలను పథకంలో సభ్యులుగా చేర్చారు. వీరందరికీ ఒక్కో యూనిట్ చొప్పున వర్తింపజేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో లబ్ధిదారులు తమ వాటా కింద 25శాతం చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం 75శాతం నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేస్తుంది. ఈ మొత్తంతో జీవాలు కొనుగోలు చేసి పంపిణీ చేస్తారు.

2,43,243 జీవాలు

జిల్లాలో మొత్తం 311 గొర్రె కాపరుల సహకార సంఘాలున్నాయి. వీటిలో 22,025 మంది సభ్యులున్నారు. 2017–18లో ప్రారంభించిన మొదటి విడత గొర్రెల పంపిణీలో భాగంగా 2018 జూన్ చివరినాటికి మొత్తం 10,078 యూనిట్లు పంపిణీ చేశారు. మొదటి విడతలో మిగిలిపోయిన యూనిట్లతో పాటు కొత్తగా ఏర్పడిన రెండు మండలాలైన దుద్యాల, హకింపేట్, చౌడాపూర్ మండల పరిధిలోని ఐదు గ్రామాలు కలుపుకొని.. రెండో విడత కింద మొత్తం 11,583 యూనిట్లు పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులకు అందనున్నాయి. గతంలో యూనిట్ విలువ రూ.1.25 లక్షలు ఉండగా.. ప్రస్తుతం రూ.1.75 లక్షలకు పెంచారు. ఇందులో లబ్ధిదారు వాటా రూ.43,750 పోనూ మిగిలిన సొమ్మును ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రతీ యూనిట్‌కు సబ్సిడీ వాటా కింద రూ.131,250 అందజేస్తుంది. ఏదైనా కారణం చేత గొర్రె చనిపోతే పరిహారం ఇచ్చేందుకు గాను ప్రతీ గొర్రెకు ప్రభుత్వమే బీమా చేయిస్తుంది. ప్రీమియం డబ్బులు యూనిట్ విలువలోనే జత చేయడంతో ప్రత్యేకంగా చెల్లించాల్సి అవసరం లేదు. ఒక్కో యూనిట్‌లో 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలును అందజేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ అయిన పాఠ్య పుస్తకాలు

సరికొత్తగా సర్కారు పుస్తకం

- నాణ్యమైన పేపర్, ఆకర్షణీయమైన రంగులు
- ఆయిల్ పెయింట్‌తో బొమ్మలు
- ఆకట్టుకుంటున్న ప్రింటింగ్, కవర్ పేజీలు
- ఆనందంలో విద్యార్థులు

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు సరికొత్త ముద్రణ, ఆకర్షణీయమైన కవర్ పేజీలతో ఆకట్టుకుంటున్నాయి. వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు ప్రారంభమై ఐదు రోజులు కాగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్నారు. ఈసారి పంపిణీ అయిన బుక్స్ నాణ్యమైన పేపర్, ఆయిల్ ప్రింట్‌తో కూడిన ముద్రణతో ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. వీటిని అందుకున్న విద్యార్థులు పుస్తకాలు బాగున్నాయని సంబరపడుతున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు– మనబడి కింద చేపట్టిన పనులతో వసతులు మెరుగయ్యాయి. ఈసారి మధ్యాహ్న భోజనం మెనూలో కూడా మార్పులు చేశారు. వీటితో పాటు నూతనంగా ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు కొత్త హంగులతో రూపొందించడంతో సర్కారు బడులు సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి.

కోడింగ్ నంబర్లు

ఈసారి విద్యార్థులకు అందిస్తున్న పుస్తకాలు కోడింగ్ నంబర్‌తో ఉన్నాయి. సబ్జెక్టుల వారీగా ఒక్కో విద్యార్థికి ఒక్కో నంబర్ కేటాయించారు. దీంతో దుర్వినియోగానికి చెక్ పడుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆకట్టుకునే రీతిలో..

ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాలన్నీ ఆకట్టుకునే అట్టలు, బొమ్మలు, టేబుళ్లు, రంగులతో నిండిఉన్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పెద్దపెద్ద బొమ్మలతో విభిన్న రంగుల్లో నాణ్యమైన పేజీల్లో ముద్రించారు. పెద్ద తరగతుల వారికి కూడా ఆయా సబ్జెక్టు పుస్తకాలలో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలు అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ స్కానర్ ద్వారా స్కాన్ చేసిన వెంటనే సంబంధిత విషయం యొక్క అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. అలాగే ఓ వైపు ఇంగ్లిష్, మరో వైపు తెలుగులో మాధ్యమంలో పుస్తకాలను ముద్రించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం కొత్త టెక్ట్స్ బుక్స్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ రూల్స్ పాటించండి

- జ్యుడిషియల్ జడ్జి అశోక్
- 783 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి

అనంతగిరి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనులు, మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారికి వికారాబాద్ ప్రత్యేక కోర్టు జ్యుడిషియల్ జడ్జి ఎస్.అశోక్ జరిమానాలు విధించారు. జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 783 కేసులు నమోదు అయ్యాయని వాటిని పరిష్కరించామని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనాలు నడపాలని ఆయన సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ చిన్నప్పల నాయుడు పరిశీలించారు. శనివారం గోనూర్ గ్రామానికి వెళ్లి పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు మండలం, పట్టణం కలిపి 117 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. అన్ని కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సౌకర్యాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తహసీల్దార్ తెలిపారు. ఇప్పటి వరకు 71 పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు మిగత 46 కేంద్రాల్లో కూడా పరిశీలించి పూర్తిస్థాయి నివేదిక అందజేస్తానన్నారు.

శ్రీవారి ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో మూలమూర్తి

కొడంగల్: స్థానిక పద్మావతీ సమేత మహాలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి మూలమూర్తికి పంచామృతాభిషేకం చేశారు. ఆలయ 53వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. శనివారం ఉదయం సుగంధ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు అభిషేకం చేశారు. పూలతో మూలమూర్తికి అలంకరించారు.

తస్మాత్ జాగ్రత్త.. క్లిక్ చేస్తే ఖల్లాసే!

సైబర్ నేరగాళ్ల నయా చీటింగ్

- వాట్సాప్ అప్‌డేట్ ఫీచర్ పేరిట లింకులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

దోమ: 'వాట్సాప్‌కు కొత్త వర్షన్ వచ్చేసింది. పింక్ లింక్‌తో అప్‌డేట్ అవ్వండి' అంటూ మెసేజ్‌లు వస్తున్నాయా? అయితే తస్మాత్ జాగ్రత్త అని పోలీసులు చెబుతున్నారు. పింక్ వాట్సాప్ ఇన్‌స్టాల్ చేసిన వెంటనే ఫోన్‌లోని డాటా మొత్తం సైబర్ నేరగాళ్లకు చేరిపోతుంది. ఆ తర్వాత వ్యక్తి సమాచారాన్ని అడ్డుపెట్టుకుని డబ్బులు డిమాండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పింక్ వాట్సాప్ పేరుతో సైబర్ నేరగాళ్లు పేద ప్రజలను టార్గెట్ చేసి డబ్బులు దండుకుంటున్నారు. ఎక్కువగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారినే బోలెడన్ని ఆప్షన్లు ఉన్నాయని మభ్యపెడుతున్నారు. దీంతో అమాయక ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్నారు.

బ్లూటిక్స్‌తో మభ్యపెడుతూ..

సైబర్ నేరగాళ్లు సామాన్య ప్రజలను మోసాలకు గురిచేస్తున్నారు. పేరు కూడా కనిపించకుండా బ్లూటిక్స్ అనే ఆప్షన్లు లేకుండా ఫోన్‌లలో సెట్టింగ్ మార్చుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్ కాల్స్ రికార్డు చేసుకోవడానికి అవకాశం ఇచ్చి నచ్చినవారి ఫొటోలను ఈజీగా మార్ఫింగ్ చేసుకోవడానికి ఆప్షన్లు ఉంచుతూ మభ్యపెడుతున్నారు. సైబర్ నేరగాళ్లు పంపే ప్రకటనలకు పడిపోయి కొంత మంది లింక్‌లను క్లిక్ చేసి పింక్ కలర్ యాప్‌కు సంబంధించిన వాట్సాప్‌ను ఓపెన్ చేస్తున్నారు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత యాప్స్‌లో ఉండే ఫొటోలు, గ్యాలరీ, కెమెరా యాక్సెస్‌కు పర్మిషన్‌కు అడగడంతో పర్మిషన్స్ ఇస్తున్నారు. దీంతో ఒకే క్లిక్ ద్వారా ఆ పింక్ కలర్ వాట్సప్ ఓపెన్ అవుతూ, సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీంతో సైబర్ నేరగాళ్లు తమ తమ సెల్‌ఫోన్‌లోని సమాచారం అంతా సేకరిస్తారు. ఈ క్రమంలో ప్రమాదకర వీడియోలను పింక్ వాట్సాప్ ద్వారా పంపించి ఫోన్‌లను హ్యాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వాట్సాప్ పింక్ లింక్

వేల రూపాయలు దండుకుంటూ..

దోమ మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ ఆయా గ్రామ పంచాయతీలలో ఉన్న గ్రూపులలో పింక్ కలర్ వాట్సాప్ లింక్‌లు చక్కర్లు కొడుతున్నాయి. దీంతో కొంత మంది తెలియని వ్యక్తులు పింక్ కలర్ వాట్సాప్ వచ్చిందంటూ ఓపెన్ చేయడంతో అది సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుంది. ఈ క్రమంలో ఓటీపీ సహాయంతో అకౌంట్‌లో ఉన్న డబ్బులను కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసుల ప్రచారంతో అప్రమత్తమైన ప్రజలు లింక్‌లను ఓపేన్ చేయకుండా జాగ్రత్తలు పడుతున్నారు.

పింక్ లింక్‌తో ప్రమాదమే



పింక్ కలర్‌తో వచ్చే వాట్సాప్ లింక్ ఎంతో ప్రమాదకరమైంది. అది ఓపెన్ చేస్తే అకౌంట్‌లలో డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారు. వాట్సాప్‌లో వచ్చిన లింక్‌ను నా కుమారుడు తెలియకుండా ఓపెన్ చేయడం ద్వారా అకౌంట్‌లో రూ. 10 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. అమాయక ప్రజలనే టార్గెట్ చేసుకుని సైబర్ నేరగాళ్లు లింక్‌లను పంపిస్తూ పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రజలను అప్రమత్తం చేయాలి.

– సైద్‌పల్లి షఫి, బొంపల్లి

అప్రమత్తతే శ్రీరామరక్ష



గ్రామీణ ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పింక్ కలర్ లింక్‌లను పంపిస్తూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. అనవసరమైన లింకులను ఓపెన్ చేయకూడదు. గతంలో తాను ఓ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించగా ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయి. అలాంటి వాటిని ఏ ఒక్కరూ నమ్మకూడదు. సైబర్ నేరాల ఉచ్చులో పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– విశ్వజన్, ఎస్ఐ, దోమ

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

పరిగి: విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పలు విత్తన డీలర్ల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిషేధిత మందులు, నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు, నిషేధిత మందులు విక్రయిస్తే సమాచారం అందించాలని సూచించారు. ఎరువులు ప్రభుత్వం ఇచ్చిన ధరలకే విక్రయించాలన్నారు. పత్తి విత్తనాలు అన్ని బీటీ రకాలే అని విత్తనాలను విత్తుకున్న తరువాత సరైన కలుపు యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అధిక దిగుబుడులు సాధించవచ్చన్నారు. తగినంత వర్షాలు కురిసిన తరువాతే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నాయకుడు మల్లేశ్

పరిగి: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి మల్లేశ్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రైవేటు బడులు ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి వేల రూపాయల ఫీజు వసూలు చేస్తున్నాయన్నారు. పుస్తకాలు, దుస్తుల పేరిట దోపిడీ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. ఎల్‌కేజీ విద్యార్థికి రూ.లక్ష వరకు ఫీజు వసూలు చేస్తున్నా విద్యాశాఖ ఎందుకు పట్టించుకోవడం ప్రశ్నించారు. పరిగిలో చాలా పాఠశాలలకు అనుమలు లేవని, అయినా నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల ఫీజు విషయంలో ఉన్నత అధికారులు ఒక పరిమితికి తీసుకురాకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బసిరెడ్డి, మాణిక్యం, నరసింహారెడ్డి, వెంకటయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర శాసన సభ ఎన్నికల గడువు సమీపిస్తున్నందున ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం తహసిల్దార్లు, సంబంధిత అధికారులతో ఓటరు జాబితా రూపకల్పనలో చేపట్టాల్సిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 2 లక్షల 26 వేల గృహాలలో సర్వే నిర్వహించి వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా నుంచి తప్పుగా తొలగించిన ఓటర్లను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి తిరిగి వారిని ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు.

మంచినీళ్ల పండగను ఘనంగా నిర్వహిద్దాం

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండగను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా బస్సులు ఏర్పాటు చేసి ప్రజా ప్రతినిధులను, విద్యార్థులను జిల్లాలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల వద్దకు తీసుకొచ్చి శుద్ధిచేసిన తాగునీటి సరఫరా జరిగే విధానాన్ని వివరించాలన్నారు. గ్రామ పంచాయతీలో ఉన్న వాటర్ ట్యాంకులను అందంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, జెడ్పీ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధి ఘనత మాదే

- మంత్రి సబితారెడ్డి



గిరిజన మహిళలకు స్వయంగా భోజనం వడ్డిస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా డబుల్ బెడ్‌రూమ్స్ పక్కన గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. ప్రత్యేక రాష్ట్రంలో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో బంజార భవన్, ఆదివాసీ భవన్ నిర్మాణం, కుమ్రంభీం జయంతి, సేవాలాల్ మహరాజ్ జయంతి, సమ్మక్క సారక్క జాతరకోసం భారీగా నిధులు వెచ్చిస్తోందని, వివిధ జాతరలకు ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. గిరిజన తండా గ్రామ పంచాయతీలలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, గ్రామ పంచాయతీ భవనాలు, వీధి దీపాలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్‌ల కొనుగోలు, పలు మౌలిక వసతులు కల్పించిందన్నారు. రాష్ట్రంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతం పెంచడం వంటి విప్లవాత్మక నిర్ణయాల ద్వారా గణనీయమైన మార్పునకు నాంది పలికారని తెలిపారు. మహేశ్వరంలో రూ.2 కోట్ల నిధులతో గిరిజన బంజార భవన్ నిర్మాణానికి నిధులు, సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ. కోటి రూపాయాలు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామన్నారు. ఇంద్రారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు రెండెకరాల విస్తీర్ణంలో రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా సంత్ సేవాలాల్ ఆలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు గిరిజన మహిళలకు మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రామేశ్వరి దేవి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, మీర్‌పేట్ కార్పొషన్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా ఆంధ్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, మాజీ జెడ్పీటీసీ ఈశ్వర్‌నాయక్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లచ్చా నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యంలో అశ్రద్ధ తగదు

- రైతుల ఫోన్ కాల్స్‌కు స్పందించాలి
- ఈఏఆర్ఐ 1962 వాహన రాష్ట్ర అధికారి డాక్టర్ భగేష్‌మిశ్రా



వాహనంలో పరికరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారి డాక్టర్ భగేష్‌మిశ్రా

కొడంగల్ రూరల్: పశువులకు వైద్యం అందించడంలో అశ్రద్ధ చూపవద్దని ఈఏఆర్ఐ 1962 వాహన రాష్ట్ర అధికారి డాక్టర్ భగేష్‌మిశ్రా అన్నారు. రైతుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే వాహన సిబ్బంది స్పందిస్తూ పశువులకు వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం పట్టణంలోని పశు వైద్యశాల ఆవరణలో వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తూ సిబ్బందికి పలు సూచనలు అందించారు. 1962 వాహనంతో పశువులకు చికిత్స అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అనంతరం వాహనంలో ఉన్న పరికరాలను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎఫ్ఈ గౌస్‌పాషా, వాహన సిబ్బంది హరి తదితరులు పాల్గొన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ

అనంతగిరి: మహిళలు, ఆడపిల్లల పైన అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో శనివారం నేర సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు రానున్నందున ప్రతి ఒక్కరూ సంబంధిత విషయాల పైన దృష్టి సారించాలన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో జరిగిన ఘటనలు, నమోదైన కేసులపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఇసుక, గుట్కా, అక్రమ పీడీఎస్ రేషన్ అరికట్టాలని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్సే



బాధిత కుటుంబీకులను ఓదార్చి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న భీంరెడ్డి, స్థానిక నేతలు

కుల్కచర్ల: నిరుపేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు బొలుసాని భీంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని సాల్వీడు గ్రామానికి చెందిన భీమయ్య, చీపిరి శ్రీనివాస్ అనే ఇద్దరు కార్యకర్తలు అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలిసి శనివారం స్థానిక నేతలతో బాధిత కుటుంబీకులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ హయాంలో అన్ని వ్యాధులకు ఉచితంగా చికిత్సలు అందించే వారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. కుల, మత, వర్గాలకు సంబంధం లేకుండా అన్ని వర్గాలకు ఉచితంగా ఆరోగ్యం అందించాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ముందుకుసాగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్‌రెడ్డి, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాండూరు టౌన్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన నట్లు రైల్వే పోలీసులు శనివారం తెలిపారు. మంతట్టి రైల్వే స్టేషన్ యార్డు సమీపంలో సుమారు 25 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. మృతుని ఒంటిపై బూడిద రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు



ఘటనాస్థలంలో కింద పడిపోయిన వెంకటయ్య

తాండూరు టౌన్: ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. బైక్‌పై ఉన్న చాపల వెంకటయ్య తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బస్సు కండక్టర్ ఎస్‌కె మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

అక్రమార్కుల బరితెగింపు





ఇసుక అక్రమార్కులు కొత్తదారులు తొక్కుతున్నారు. ట్రాక్టర్లకు నంబర్లు తొలగించి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. కాగ్నా నది నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. శనివారం ట్రాక్టర్‌కు నంబర్ ప్లేట్ తొలగించి తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుటే నుంచే ఇసుకను తరలిస్తుండటం గమనార్హం.

– తాండూరు రూరల్

అద్దెకున్న వాడే హతమార్చాడు

- ఆభరణాల కోసమే హత్య
- జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు

నందిగామ: వృద్ధురాలు, మనవరాలు జంట హత్యల కేసును పోలీసులు ఛేదించారు. శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి శనివారం నందిగామ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నందిగామకు చెందిన ఏర్రగారి పార్వతమ్మ(65)కు వారసులు లేరు. సొంతింట్లో ఉంటూ సమీపంలోని బండకుంట తండా అంగన్‌వాడీలో ఆయాగా పనిచేస్తోంది. ఆమెకు తోడుగా మనమరాలు (చెల్లెలు కొడుకు కృష్ణయ్య కూతురు) భానుప్రియ (9) ఉంటోంది. నాయనమ్మతోనే ఉంటూ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో పార్వతమ్మ ఇంట్లో ఓ గది ఖాళీగా ఉండటంతో బీహార్ రాష్ట్రం జాముల్ జిల్లా జహజా గ్రామానికి చెందిన దివాకర్ సాహూ (23) భార్య అంజలీ దేవితో కలిసి నాలుగు నెలల క్రితం అద్దెకు దిగారు. దివాకర్ సాహూ స్థానిక ఎంఎస్ఎన్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తుండగా, అతడి భార్య మరో పరిశ్రమలో పనిచేస్తోంది. భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండటంతో పార్వతమ్మ వారిని వారించి వారం రోజుల క్రితం గదిని ఖాళీ చేయించింది. దీంతో ఆ దంపతులు అదే గ్రామంలో మరో ఇంట్లో అద్దెకున్నారు.

ఆభరణాలపై కన్నేసి..

గదిని ఖాళీ చేయించిందనే కోపంతో పాటు పార్వతమ్మకు ఎవరూ లేరని గమనించిన సాహూ పార్వతమ్మ ధరించిన బంగారు ఆభరణాలపై కన్నేశాడు. ఎలాగైనా ఆమెను మట్టుపెట్టి వాటిని కొట్టేయాలని ప్రణాళిక రచించాడు. అదనుకోసం ఎదురుచూస్తున్నాడు. గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం పార్వతమ్మ, ఆమె మనమరాలు భానుప్రియ ఇంట్లోని వరండాలో నిద్రపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1.30 గంటల సమయంలో దివాకర్ సాహూ గుట్టు చప్పుడు కాకుండా గేటు దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. పార్వతమ్మ గొంతు నులిమి తలపై ఇటుకతో దాడి చేశాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోగా, భానుప్రియ లేచి అరవడానికి ప్రయత్నించడంతో పక్కనే ఉన్న ఇటుకతో తలపై కొట్టి, కత్తితో గొంతు కోసి చంపేశాడు. అనంతరం పార్వతమ్మ దగ్గరున్న సంచిలో నుంచి బీరువా తాళాలు తీసుకొని బీరువా తెరిచి అందులోని సుమారు నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు, బంగారు వంకు, వెండి కాలి పట్టాలు, రూ.వెయ్యి నగదు దోచుకొని వెళ్లిపోయాడు. తన కూతురు ఇంటికి రాలేదని భానుప్రియ తల్లి శుక్రవారం రాత్రి పార్వతమ్మ ఇంటికి వెళ్లి చూడగా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది.